

హైదరాబాద్ వార్త

## బడికి బాట చూపించారు...థాంక్యూ సర్

-హైడ్రాకు కమిషనర్‌ను కలిన ప్రభుత్వపాఠశాల విద్యార్థులు

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:**
మా బడికి బాట చూపారంటూ... హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కి సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణతో కలిసి వచ్చిన విద్యార్థులు కమిషనర్‌ను కలిసి మొక్కను బహూకరించారు. మే నెల 26వ తేదీన జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి గౌరవనీయ సీఎం గారు.. మా బడికి బాట వేయించండి అంటూ ప్లకార్డు పట్టుకుని ధర్నాకు దిగిన వార్త మీడియాలో ప్రసారం అవ్వడంతో హైడ్రా రంగంలోకి దిగింది. హైడ్రా కమిషనర్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఆదిత్య క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. పాఠశాలకు వెళ్లే మార్గంలో అడ్డంగా ఉన్న ప్రహరీని తొలగించి జీహెచ్ ఎంసీ సహకారంతో అక్కడ రోడ్డు వేయించి.. పాఠశాలకు గేటు కూడా పెట్టించారు. దీంతో అప్పుడే సంబరాలు చేసుకున్న విద్యార్థులు మంగళవారం నేరుగా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మీరంతా బాగా చదువుకోవాలని కమిషనర్ చెప్పగానే అందరూ ముక్తకంఠంతో ఓకే సార్ అన్నారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న దూద్‌బావి పాఠశాల విద్యార్థులు, చిత్రంలో హెచ్‌ఎం మల్లికార్జున్‌రెడ్డి తదితరులు

# భూదాన్ భూముల్లో రియల్ దందా

- భారీ షెడ్లు, ఇండిపెండెంట్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు
- పదుల సంఖ్యలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- అడ్డగోలు నిర్మాణాలకు అధికారుల సహకారం?
- ఫిర్యాదులు చేసిన చర్యలకు వెనకడుగు
- రెవిన్యూ,మున్సిపల్ యంత్రాంగం తీరుపై సర్వత్రా విమర్శలు
- హైడ్రా అధికారులు స్పందించి అక్రమాలపై చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్



భూదాన్ స్థలాల్లో వెలసిన భారీ షెడ్లు,



గాగిల్లాపూర్ అక్రమంగా కొనసాగుతున్న ఇండిపెండెంట్ ఇండ్ల నిర్మాణాలు

**దుండిగల్, జూన్ 17 ప్రభాతవార్త:**
భూదాన్ భూముల్లో కొంతకాలంగా రియల్ దందా జోరందుకుంది. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ భారీ,భారీ షెడ్లు, ఇండిపెండెంట్ ఇండ్ల నిర్మాణాలను ఇష్టారీతిన కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భూదాన్ స్థలాల్లో అడ్డగోలుగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు సదరు అక్రమ నిర్మాణాలకు ఓ వంకు చూపిస్తూ పురపాలిక ఇంటి నంబర్లు జారీ చేయడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. స్థానికుల నుండి ఫిర్యాదులు అందిన చర్యలు చేపట్టకుండా అధికారులు మౌనం వహిస్తూ పరోక్షంగాను, పలుచోట్ల ప్రత్యక్షంగాను అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భూదాన్ స్థలాల్లో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్న ఉన్నతాధికారులు, విజిలెన్స్ విభాగం దృష్టి సారించకపోవడం వెనుక పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మదుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి పరిధిలో దాదాపు 13 ఎకారాల భూదాన్ స్థలాలు ఉన్నట్లు రెవిన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇవే నంబర్లలోని స్థలాలను ప్రొహైబిటెడ్ లిస్టులో ప్రభుత్వ స్థలాలు పేర్కొంటూ 22-ఏలో పొందుపరూస్తూ అధికార ఉత్తర్వులను (24-07-2024) రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌కు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ఇట్టి స్థలాల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేయకూడదని స్పష్టం అవుతుంది. అదే సమయంలో సదరు స్థలాల్లో వ్యవసాయం మినహా ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అయితే ప్రభుత్వ నిబంధనలు, ఉన్నతాధికారుల ఆదేశాలను తుంగలో తొక్కి భూదాన్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు. ఎకరం స్థలంకు పైగా విస్తీర్ణంలో భారీ షెడ్లను నిర్మించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. షెడ్లతో పాటు తాజాగా భవన నిర్మాణాలు సైతం చేపట్టారు. అక్రమంగా నిర్మించి భారీ షెడ్లకు పురపాలిక నుండి ఇంటి నంబర్ మంజూరు చేసినట్లు తెలుస్తుంది.

**గాగిల్లాపూర్ పరిధిలో...**
గాగిల్లాపూర్ పరిధిలోని 70ఎకరాలకు పైగా భూదాన్ స్థలాలు ఉన్నట్లు రెవిన్యూ రికార్డులు పేర్కొంటున్నాయి. ఇట్టి భూదాన్ స్థలాల్లో అనేక షెడ్లు నిర్మించి వివిధ వ్యాపార కలాపాలు కొనసాగిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అదే విధంగా సర్వేనంబర్ 145 హెచ్‌ఎండిఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం కమర్షియల్ జోన్ పరిధిలో ఉంది. ఇట్టి సర్వేనంబర్‌లో ఓ రియల్ సంస్థ ఇండిపెండెంట్ ఇండ్ల నిర్మిస్తుంది. పూరాతన పంచాయతీ అనుమతులు ఉన్నట్లు పేర్కొంటూ పురపాలిక, రెవిన్యూ, హెచ్‌ఎండిఏ నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు జరుపుతున్న అధికార యంత్రాంగం చర్యలు చేపట్టేందుకు వెనకడుగు వేస్తోంది. ఆయాశాఖల సహాకారంతో నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి. తమ రాజకీయ చతురతను ప్రదర్శించి మాయమాటలు చెప్పి కొనుగోలుదారులకు ఒక్కొ ఇళ్ళు కొటిన్నరకు పైగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**అడ్డగోలు నిర్మాణాలు...దృష్టిసారించని విజిలెన్స్,ఎన్‌పోర్స్‌మెంట్**
గండిమైసమ్మదుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి, గాగిల్లాపూర్ పరిధుల్లోని భూదాన్ స్థలాల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విజిలెన్స్, ఎన్‌పోర్స్‌మెంట్ విభాగాలు దృష్టిసారించకపోవడం చర్చనీయాంశంగా మారింది. స్థానిక అధికారుల నిర్లక్ష్యం, ఉన్నాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో భూదాన్ స్థలాల్లో యథేచ్ఛగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికుల ఫిర్యాదులు సైతం బుట్టదాఖలు అవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా పేర్కొనవచ్చు.

**హైడ్రా స్పందించి అక్రమాలపై చర్యలు చేపట్టాలి : స్థానికులు**
ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి భూదాన్ స్థలాల్లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెవిన్యూ, పురపాలిక యంత్రాంగం నిర్లక్ష్య వైఖరితో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని మండిపడుతున్నారు. ఈవిషయమై హైడ్రా కలుగుజేసుకొని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులు, ఆదాయాన్ని కాపాడాలని కోరుతున్నారు.

### నోటీసులు జారీ చేశాం..చర్యలు చేపడుతాం : తహసీల్దార్ సయ్యద్ మతీన్

భూదాన్ స్థలాల్లో నిర్మాణాలపై తహసీల్దార్ సయ్యద్ మతీన్‌ను ప్రభాతవార్త ప్రతినిధి వివరణ కోరగా స్పందించారు. దొమ్మరపోచంపల్లి, గాగిల్లాపూర్ పరిధుల్లోని భూదాన్ స్థలాల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సదరు నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసుల గడువు ముగియగానే నిబంధనల ప్రకారం చర్యలు చేపడుతామని తెలిపారు.

# కాసులిస్తేనే సరి ..లేదంటే కిరికిరి

- -జిహెచ్‌ఎంసిలో పెట్రేగుతున్న అవినీతి
- -లంచం ఇవ్వాలంటూ కాంట్రాక్టర్లకు వేధింపులు
- -లేకుంటే బిల్లులు రాకుండా చేస్తామని అధికారుల బెదిరింపు
- -అడిగినంత చెల్లించలేక ఏసిబిని ఆశ్రయిస్తున్న బాధితులు
- -తాజాగా ఎసిబికి పట్టుబడ్డ చర్లపల్లి డివిజన్ ఏఈ స్వరూప







రైటప్: మంగళవారం ఏసిబికి చిక్కిన కాప్రాసర్కిల్ ఏఈఈ స్వరూప

**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:**
నగర ప్రజలకు సేవలందించే జీహెచ్‌ఎంసీలో పరిపాలన పరంగా ఎన్ని సంస్కరణలు తీ సుకువచ్చినా, అవినీతి, అక్రమాలకు బ్రేక్ పడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు కమిషనర్లుగా వచ్చిన ఉన్నతాధికారులంతా అవినీతిని కట్టడి చేస్తామని గొప్పగా ప్రకటనలు చేసినా, క్షేత్ర స్థాయిలో అవి ఫలించకపోవటం వల్లే రోజురోజుకు అవినీతి పెరిగిపోతుందన్న వాదనలున్నాయి. గడిచిన నాలుగు నెల ల్లోనే నలుగురు అధికారులను లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నా, అక్రమార్కులు కనీసం భయపడటం లేదు. అవినీతి, అక్రమాలను అడ్డుకునేందుకు కొత్త సంస్కరణలను తీసుకువస్తున్నామని అధికారులు చేస్తున్న ప్రకటనలు క్షేత్రస్థాయిలో ఏ మాత్రం అమలు కాకపోవటం, లంచం తీసుకుని పట్టుబడిన తర్వాత శిక్షలు కఠినంగా ఉండకపోవటం, చట్టంలోని లొసుగులతో అవినీతి యథావిధి గా కొనసాగుతున్నట్లు చర్చ జరుగుతోంది. తాజాగా జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్‌చర్లపల్లి డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని నగరానికి చెందిన కాంట్రాక్టర్ ఏఈ స్వరూపను కోరారు. బిల్లులు చెల్లించేందుకు రూ.1.20 లక్షలు లంచం ఇవ్వాలని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో చేసేది లేక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రణాళిక ప్రకారం బాధితుడి నుంచి ఏఈ స్వరూప లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఏఈ స్వరూపను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా గతంలో కూడా కాంట్రాక్టర్లను లంచాల పేరుతో ఇబ్బందులకు గురిచేసినట్లు ఆమెపై ఆరోపణలున్నాయి.

**ఇటీవల ఏసిబికి చిక్కిన జిహెచ్‌ఎంసి అధికారులు..**
-గతనెలలో సికింద్రాబాద్ ప్రాంతీయ కార్యాలయంలో సహాయక టౌన్ ప్లానర్ బి. విఠల్ రావును సైతం ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదుదారునికి చెందిన రెండు భవంతులకు సంబంధించిన ఆక్యుపెన్సీ ధ్రువీకరణ పత్రాలను అందించడానికి అధికారికంగా సహాయం చేసేందుకు ఎనిమిది లక్షల రూపాయల లంచం డిమాండ్ చేసి, అందులో అప్పటికే నాలుగు లక్షల రూపాయలు తీసుకున్నాడు. మిగిలిన నాలుగు లక్షల రూపాయల కోసం డిమాండ్ చేయడంతో సదరు భవన యజమాని ఏసీబీకి ఫిర్యాదుదారు చేశారు. దీంతో మిగిలిన డబ్బు ఇస్తుండగా ఆఅధికారిని ఏసీబీ అరెస్ట్ చేసింది.
-గత ఏప్రిల్ నెలలో శేరిలింగంపల్లి జోనల్ మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీడైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ఏసీబీ వలకు చిక్కారు. రూ.70 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. శ్రీనివాస్.. చార్మినార్ జోన్ ఇన్చార్జిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్లో అర్బన్ బయో డైవర్సిటీ వింగ్‌లో రూ. 45 లక్షల మొక్కల కాంట్రాక్టుకు సంబంధించిన బిల్లులను క్లియర్ చేయడానికి కాంట్రాక్టర్ దగ్గర నుంచి శ్రీనివాస్ రూ.2,20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.70,000 లంచం తీసుకుంటుండగా ఆయన్ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గాపట్టుకున్నారు.
-అలాగే మార్చినెలలో కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ జీహెచ్‌ఎంసీ డిప్యూటీఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(డీఈఈ) దశరథ్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. క్వాలిటీ క్లియరెన్స్ రిపోర్టు ఇచ్చేందుకు రూ.20 వేల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జీహెచ్ ఎంసీ డివిజన్2లో ఓకాంట్రాక్టర్ రోడ్డు నిర్మించాడు. బిల్లుల చెల్లింపు కోసం బంజారాహిల్స్ డివిజన్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ దశరథ్ వద్దకు ఫైల్ వెళ్లింది.
ఇందుకోసం దశరథ్.. ఆకాంట్రాక్టర్ ను రూ.30 వేల లంచం అడిగాడు. మొదటి విడతగా కాంట్రాక్టర్ వద్ద రూ.10 వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. క్వాలిటీ రిపోర్ట్ ఇచ్చే సమయంలో మిగతా డబ్బు ఇవ్వాలని సూచించాడు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు రూ.20 వేలు అందించగా, ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

# శిల్పాలేఔట్ ఫ్లైఓవర్ సుందరీకరణ పనులు త్వరగా పూర్తిచేయాలి

**-అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం**

**హైదరాబాద్, జూన్ 17,ప్రభాతవార్త:**
శిల్పాలేఔట్ ఫేస్ 2 ఫ్లైఓవర్‌కు సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఓఆర్ఆర్ నుండి గచ్చిబౌలి వరకు రూ. 178 కోట్ల వ్యయంతో చేపట్టిన శిల్పా లేఔట్ త్వరలో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో మంగళవారం కమీషనర్ పరిశీలించారు. గచ్చిబౌలి, హాఫీజ్ పేట్ ఫ్లై ఓవర్లు, ఇతర అభివృద్ధి పనులు పరిశీలించి వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ శిల్పాలేఔట్ ఫేస్ 2 ఫ్లైఓవర్ పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధంగా ఉన్నందున మిగిలిన సుందరీకరణ, గ్రీనరీ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగూ ఐ.ఆర్.సి నిబంధనల మేరకు ట్రాన్స్ ఫర్ బార్ (రంబుల్ స్ట్రిప్స్) ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కమీషనర్ వెంట ప్రాజెక్ట్ సిఈ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈఈ హరీష్, జోనల్ ఎస్ఈ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హాఫీజ్ పేట్‌లో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాఫీజ్ పేట్ ఫ్లైఓవర్ కింద వ్యర్థాలను తొలగించి స్పోర్ట్స్‌కు అనుకూలంగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ నుండి ఈర్ల చెరువు డ్రైనేజీ డైవర్షన్ పనులను పరిశీలించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని మజీరా పైప్ లైన్ సిసి రోడ్డు పనులకు ప్రతి పాదనకు సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. ఈకార్యక్రమంలో కమీషనర్ వెంట కార్పొరేటర్ జగదీష్ గౌడ్, జోనల్ ఎస్ఈ శంకర్ నాయక్, లేక్స్ ఈఈ నారాయణ, డిప్యూటీ కమీషనర్ తదితరులు పాల్గొన్నారు.





ఫ్లైఓవర్ సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

## ఆషాఢ బోనాల ఉత్సవాలతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్

-సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాల ఉత్సవాల ఏర్పాట్లు

-26న గోల్కొండ ఆలయంలో తొలి బోనంతో ప్రారంభం



గోల్కొండ బోనాల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్.

**మెహదీపట్నం, జూన్ 17, ప్రభాతవార్త :**
ఆషాఢ బోనాల ఉత్సవాలతో తెలంగాణ ఖ్యాతి విశ్వవ్యాప్తం కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్ చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం గోల్కొండ కోట ఆవరణలో పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బి, విద్యుత్, దేవాదాయ, వైద్య ఆరోగ్య, జిహెచ్‌ఎంసి, అగ్నిమాపక, టూరిజం, సమాచార శాఖ అధికారులతో శ్రీ జగదాంబ మహంకాళి దేవస్థానంలో బోనాల కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, భక్తులకు ఇబ్బందిగా కలగకుండా బారీ గేట్స్, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రెప్ప పాటు కూడా కరెంటు పోకుండా నిరంతరం విద్యుత్ శాఖ విద్యుత్ ను సరఫరా చేయాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ ఏర్పాట్లను పర్యవేక్షించాలని, బోనాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. చాలా సంవత్సరాలు గా హైదరాబాద్ షాన్ గా గోల్కొండ నుండి తొలి బోనం జూన్ 26 న ప్రారంభం అవుతుందని ఎలాంటి లోటుపాట్లు లేకుండా భక్తులకు అసౌకర్యం లేకుండా ఈ ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. అధికారులు బాధ్యత గా ఉంటూ అమ్మవారికి సేవ చేసుకునే అవకాశం దొరికిందని బాధ్యత గా నిమగ్నమై పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే బోనాల ఉత్సవాలకు 20కోట్లు నిధులు కేటాయించారని తెలిపారు. ఎం సి హెచ్ ఆర్ డి లో ఇప్పటికే బోనాల ఉత్సవాలపై రివ్యూ చేసుకున్నామని, ప్రముఖ దేవాలయాలకు ప్రముఖులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అమ్మ దయవల్ల తెలంగాణలో సమృద్ధి వర్షాలతో పాడి పంటలతో మంచి వ్యాపారాలతో అంతా మంచి జరగాలని వేడుకొందామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకులు తొలి బోనం గోల్కొండలో జరిగే ఉత్సవాలు పాల్గొనేలా చేయాలన్నారు. ప్రపంచ సాంకేతికత పెరిగిన ఆషాఢ మాస బోనం నెత్తిమీద పెట్టుకొని వస్తున్నామని, గోల్కొండ బోనాలకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. పోలీస్ లు ఎక్కడ ఇబ్బందులు లేకుండా భద్రత చర్యలు చేపట్టాలని, కోట కింద భక్తుల క్యూ ఎక్కువగా ఉంటుందని బారికేడ్లు ఏర్పాటు చేసి జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఉండేలా చూసుకోవడంతోపాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, హెల్త్ క్యాంప్ లు , అంబులెన్స్ లు ఏర్పాటు, షి టీమ్ లు ఏర్పాటు చేసి మహిళలకు ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణ చేయాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ విభాగం అప్రమత్తంగా ఉండి, అగ్నిమాపక వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గోల్కొండ కు ఆర్టీసి హైదరాబాద్ లోని పలు బస్ స్టాప్ ల నుండి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి మహిళలకు ఉచితంగా బస్సులు ప్రభుత్వం అందిస్తుండడంతో మహిళా భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. సమాచార ప్రసార శాఖ లైవ్ టెలికాస్ట్ చేయడం, సాంస్కృతిక శాఖ తో సమన్వయం, టూరిజం నుండి హరిత హోటల్ లు , లేక్స్ టూరిజం స్పాట్స్ పై డిస్ ప్లే చేయాలన్నారు. బోనాల ఉత్సవాలు విజయవంతం చేయడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన ప్రజల సహకారం తప్పక ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, శాసనసభ్యులు కౌసర్ మొహియొద్దీన్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డి, డిసిపి చంద్రశేఖర్, వివిధ దేవాలయ చైర్మన్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పిల్లలకు యూనిఫామ్స్...నోట్‌బుక్స్ అందాయా..!

-బంజారాహిల్స్ ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

-విద్యార్థులతో మాటామంతి..సమస్యలుంటే చెప్పాలని సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:**
రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. ఈమేరకు మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం 7లోని గత ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్కూల్‌లో విద్యార్థులతో నేరుగా మాట్లాడి ఏవైనా సమస్యలున్నాయా అంటూ ప్రశ్నించారు. యూనిఫామ్స్, నోట్‌బుక్స్ వచ్చాయా.. అంటూ వాకబు చేశారు. అన్ని క్లాసులను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులచేత టెక్స్ట్‌బుక్స్ చదివించారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అలాగే స్కూల్‌లో ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారని ..పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, టాయ్‌లెట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిశుభ్రకరమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని అద్యాపకులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఈవో రోహిణి, డిప్యూటీ ఈవో శ్యాముల్‌రాజ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**అంగన్వాడి పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందాలి : కలెక్టర్ హరిచందన**
జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న అంగన్వాడి కేంద్రాలు, సఖి కేంద్రాలు, శిశు విహార్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు గర్భిణీలు, బాలింతలు అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలని ఆమె సూచించారు. జిల్లాలోని చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, నాంపల్లి అలాగే సికింద్రాబాద్ ప్రాజెక్టులలోని 37 సెక్టార్లలో నడుస్తున్న 970 అంగన్వాడి కేంద్రాలలో బాలింతలు అలాగే వివిధ వయసుల గల బాలబాలికలు మొత్తం 1,55,869 మంది ఉన్నారని అట్టివారికి మెరుగైన సేవలు అందాలని, సిడిపివోలు క్షేత్రస్థాయి పర్యటనలు నిరంతరం చేపట్టాలని ఆమె సూచించారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అలాగే జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ముఖ్యంగా స్లమ్ ఏరియాలలో ఉన్నటువంటి పిల్లలకు అంగన్వాడి కేంద్రాలకు వచ్చే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. టీచర్లకు పౌష్టికాహారం అందించుటలో శిక్షణలు ఇవ్వాలని సూచించారు. అనాధ పిల్లలకు బర్త్ సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ అలాగే ఆరోగ్యశ్రీ కార్డులు అందించే తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సఖి కేంద్రం ద్వారా వచ్చిన కేసులు, కౌన్సిలింగ్ అలాగే నిర్వహణ తీరు నష్ట పరిహారం చెల్లింపుల విధానం అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు 106 మంది పిల్లలను వారి కుటుంబాలకు అప్పగించడం జరిగిందని అలాగే దత్తత ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాలకు లోబడి ఇప్పటివరకు 108 పిల్లలను దత్తత ఇవ్వటం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సిడిపివోలు, సఖి నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారాన్ని ఆపాలి

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** దళిత సమాజాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా మేడే రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారం తగదని, తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇకనైనా కాంగ్రెస్ పార్టీ విషప్రచారాన్ని మానుకోవాలని పలు దళిత క్రిస్టియన్ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రముఖ గాయని మంగ్లీ బర్త్‌డే వేడుకల్లో మేడే రాజీవ్‌సాగర్ ఉన్నారని కొంత మంది చేసిన తప్పుడు ప్రచారాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ జెఏసి ఛైర్మన్ సాల్మన్‌రాజు, క్యాథలిక్ చర్చి అసోసియేషన్ కార్యదర్శి లియోలూయిస్ మాట్లాడుతూ ఇది కేవలం రాజీవ్‌సాగర్‌పై వ్యక్తిగత విమర్శలు కాదని, దళిత క్రిస్టియన్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్న కుట్రగా ఉందని, ఆయన ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. క్రైస్తవులు రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు ఇదొక ప్రయత్నమని వారు విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్‌సాగర్‌పై దుష్ప్రచారాన్ని అపాలని వారు డిమాండ్ చేశారు.

### బాలబాలికలకు అక్షర అభ్యాసం చేయించిన కార్పొరేటర్



అంగన్‌వాడిలో బాలబాలికలకు అక్షర అభ్యాసం

**బేగంబజార్, జూన్ 17ప్రభాతవార్త:** బడి బాట కార్యక్రమంలో భాగంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ కమ్యూనిటిహాల్‌లో అంగన్‌వాడి టీచర్లు నిర్వహించిన అక్షర అభ్యాసం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌గొంటి శంకర్‌యాదవ్ పాల్గొన్ని బాలబాలికలకు అక్షర అభ్యాసం చేశారు. ఈకార్యక్రమంలో బేగంబజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులు బండ క్రాంతి కుమార్, సుదీర్ సింగ్, శ్రీనివాస్, అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, విద్యావతి, వనితఠాకూర్, లక్ష్మి, గిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి : ఆనంద్ కుమార్‌గౌడ్



డిసికి వినతి పత్రం అందచేస్తున్న బిఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్

**అఫ్జల్‌గంజ్, జూన్ 17ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరుతూ గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గోషామహల్ జిహెచ్ఎంసి సర్కిల్ 14 డిప్యూటి కమీషనర్ లావణ్యకు ఆనంద్ కుమార్‌గౌడ్ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. గోషామహల్ నియోజకవర్గంలోని ఉన్న దేవాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. అంతేకాకుండా పండుగనెల రోజుల సమయం ఉంది కాబట్టి ముందుస్తుగా దేవాలయాలవద్ద ప్యాచ్‌వర్క్స్, డ్రైనేజీ సమస్యలను నివారించి అభివృద్ది పనులు చేపట్టాలన్నారు. జూలై 16,17 తేదిలల్లో చాక్నవాడి, మహారాజ్‌గంజ్ బోనాల పండుగ జరుగుతుందన్నారు. 20,21 తేదిలలో గోషామహల్ నియోజకవర్గంలో పూర్తిగా బోనాల పండుగను నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ అహ్మద్, నరేష్‌గౌడ్, భజన్‌సింగ్, మహేందర్ పాల్గొన్నారు.

### సిసి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయండి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త**

కాల్విన్ కాలనీ డివిజన్లో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. మంగళవారం కాలుని కాలనీ డివిజన్లో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. డివిజన్ పరిధిలోని శంషిగుడాలో ఇరవైరెండు లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని ఈ విషయంలో జి.ఎచ్.ఎం.సి అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచి పోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### స్మశాన వాటికను సందర్శించిన జడ్‌సి అపూర్వ్ చౌహాన్



జడ్‌సికి వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**అల్వాల్, జూన్ 17 ప్రభాతవార్త:**

మచ్చబొల్లారం ముక్త ధామమ్ స్మశాన వాటిక అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహాన్ పేర్కొన్నారు. మంగళవారం స్మశాన వాటికను సందర్శించిన అయనకు అక్కడి పరిస్థితులను కార్పొరేటర్ జితేందర్‌నాథ్ వివరించారు. బోర్‌వెల్, బాత్‌రూముల పునరుద్దరణ, డ్రైనేజి, అస్థికల గది నిర్మాణం, విశ్రాంతి గదులు ఇతర సదుపాయాలు కల్పించాలని కార్పొరేటర్ కోరారు. మోడల్ స్మశాన వాటికగా తీర్చదిద్దడానికి జిహెచ్ఎంసి పరంగా సహకరిస్తామని జడ్‌సి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వశాన వాటికకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

### బాల బాలికలకు నోట్‌బుక్‌లను అందచేసిన కార్పొరేటర్

**గన్‌ఫౌండ్రి, జూన్ 17ప్రభాతవార్త:** దేశ ప్రధాన మంత్రిగా నరేంద్రమోడి 11 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో బాల, బాలికలకు ఉచితంగా పుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్‌లను స్థానికగన్‌ఫౌండ్రి కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా అందచేసినట్లు తెలిపారు. సుధాకర్ పైపు సహకారంతో ప్రభుత్వ బాయ్స్ పాఠశాల, గవర్నమెంట్ మోడల్‌స్కూల్ అలియా మొహబూబియా ప్రభుత్వపాఠశాలలోని బాల బాలికలకు బ్యాగ్‌లు, నోట్ బుక్, టిఫిన్ బాక్సులు అందచేశారు. తెలంగాణ దళిత మోర్చ ఉపాధ్యక్షులు ఓప్రకాష్‌బిస్వా, సుధాకర్ పైపు డైరెక్టర్ మీలా సంజయ్, శ్రీకాంత్, రాకేష్, కార్తీక్, చింటూ, రాజేష్, రేఖ, విమల, స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్ధులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం పర్మిట్ల దందాలకు తెరలేపింది

### -ప్రభుత్వం హామీలను అమలు చేసిన తరువాతే పర్మిట్లు ఇవ్వాలి




సమావేశంలో మాట్లాడుతున్న రవిశంకర్

**సైఫాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు మరిచిన రాష్ట్ర ప్రభుత్వం పర్మిట్ల దందాలకు తెరలేపిందని, తమ విధానాలను మార్చుకోవాలని ఆటో జెఏసి నాయకులకు తెలంగాణ ఆటో అండ్ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జెఏసి హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదని మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్‌లలో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించి ఆటో డ్రైవర్లకు ఆత్మహత్యలు చేయిస్తున్నదని, తమ కుటుంబాలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్లు అల్లాడిపోతుంటే కొత్తగా పర్మిట్లు ఇచ్చి అక్రమ దందాకు ప్రభుత్వం తెలిలేపిందని జెఏసి నాయకులు విమర్శించారు. మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిపిటిఎంఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ జెఏసి నాయకులు కొమరయ్య, రవికుమార్, రవి, హబీబ్, పెంటయ్య తదితరులు మాట్లాడుతూ అసలే ఆటోలకు గిరాకిలు లేక అల్లాడుతుంటే ప్రభుత్వం మరిన్ని ఆటోలకు పర్మిట్లు ఇవ్వడమంటే ఇంకా ఆత్మహత్యలను ప్రోత్సహిస్తుందనడంలో సందేహం లేదని ఆరోపించారు. బిఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘం, ఎఐటియుసికి సంబంధించిన సిపిఐ ఎమ్మెల్యే కలిసి లాబియింగ్ చేసి కొత్తఆటోలకు పర్మిట్లు తెచ్చి ఆటో డ్రైవర్లకు ఇబ్బందికి గురి చేసి మోసం చేయడమేనని వారు విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసిన తరువాతే ఆటో పర్మిట్లుకు జీవొ విడుదల చేయాలని, కొత్త పర్మిట్లు ఇచ్చే విధానానికి స్వస్తి పలకాలని, ఎలక్ట్రిక్ ఆటోలు రాష్ట్ర వ్యాప్తంగా ఉండాలని, 12వేలు ఆర్థిక సహాయం చెల్లించాలని, తక్షణమే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్‌తో వ్యక్తిగత స్వేచ్ఛను భంగం కలిగించడం దుర్మార్గమైన చర్య

**- టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కెపిహెచ్బి కాలనీ, జూన్ 17, ప్రభాతవార్త**

తప్పు చేసిన వారెవరైనా శిక్షార్హులే చట్టం నుండి ఎవరు తప్పించుకోలేరని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫోన్ ట్యాపింగ్‌లో భాగంగా నా వ్యక్తిగత పొలిటికల్ నెంబర్ రెండు ఫోన్ నెంబర్లు ఫోన్ ట్యాపింగ్ అయ్యాయని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో 2023 ఎన్నికల సమయంలో నవంబర్ 14 నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 600 ఫోన్లు ట్యాపింగ్ చేసారని కాంగ్రెస్ పార్టీ నాయకులవి 450 పైన మిగితావి వివిధ రంగాల వారివి ట్యాపింగ్ చేసారని సిఐ చెప్పారని అన్నారు. అందులో నా నెంబర్లు ఉన్నాయని చెప్పారు. ఇందులో కేసీఆర్, ఆనాటి పాలకుల ఆలోచన ప్రతిపక్ష పార్టీలు బ్రతకొద్దని, ట్యాపింగ్ ఆయుధంతో రాజకీయ నేతలను, సినీ ప్రముఖులను, వ్యాపారవేత్తలను, న్యాయమూర్తులను అందరిని బ్లాక్ మెయిల్ చేసి అందరి జీవితాలతో ఆడుకున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసి అనేక కుటుంబాలలో చిచ్చు పెట్టి, ప్రతిపక్ష నాయకులకు నిద్రలేకుండా చేసి, వారు చేసే పనులను తెలుసుకోని బ్లాక్ మెయిల్ చేసి రాజకీయంగా వాడుకున్న దుర్మార్గమైన చర్య ఈ తెలంగాణ రాష్ట్రంలో జరిగితే దేశం మొత్తం ఉలిక్కిపడిందని అన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ గత 8 ఏళ్లపాటు ఫోన్ ట్యాపింగ్‌లు చేసారని, ఆ నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టుగానే అవినీతి చేసిన వాళ్ళని చట్టం ముందు నిలబెడుతా ప్రభాకర్ రావు మీరు ఏ దేశంలో దాక్కున్నా తెలంగాణకు పిలిపిస్తా చట్టం ముందు నిలబెట్టే బాధ్యత నాదని, ఈ రోజు అదే జరుగుతుందని అన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌లో ఎస్‌బిఐ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుని మిగితా నిందితులందరిని వెంటనే శిక్షించాలని సత్యం శ్రీరంగం డిమాండ్ చేసారు.

## సెల్‌ఫోన్ల దొంగలు అరెస్టు ... రూ.25 లక్షల సొమ్ము స్వాధీనం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బేగంపేట ఏసిపి గోపాల క్రిష్ణమూర్తి బోయిన్‌పల్లి సిఐ తిరుపతి రాజు, ఎస్ఐలు

**కంటోన్మెంట్, జూన్ 17 ప్రభాతవార్త:** సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న ముగ్గురి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు బేగంపేట్ ఏసిపి పి.గోపాల క్రిష్ణ మూర్తి తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిసా రాష్ట్రం జైపూర్‌కు చెందిన గంట చిన్నా (40) దిల్‌సుఖ్ నగర్ నివాసం ఉంటున్నాడు. అదే విధంగా మల్లాపూర్ హౌజింగ్ బోర్డుకు చెందిన ప్రధాన్ శ్రీకాంత్ 22, అవుల గోపిరావు 20, అనే ముగ్గురు వ్యక్తులు నెంబర్ ప్లేట్లులేని రెండు బైక్‌లతో అనుమానస్పదంగా సంచరిస్తున్నారు. ఉప్పల్‌లోని ఫిర్జాదిగూడకు చెందిన రాజ నర్సింహ్మా ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం ఫుట్‌పాత్ సిగ్నల్ దాటుతుండగా బైక్ దగ్గర పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తికి సహాయం చేయడానికి సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయాడు. అందులో ఒకరిని పట్టుకొని పోలీసులను అప్పగించారు. వారినిఅదుపులోకి తీసుకొని విచారించగా 25 లక్షల విలువ చేసే 77 సెల్‌ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. దొంగిలించిన సెల్ ఫోన్లను జహింగీర్ అనే వ్యక్తి వద్ద ఉంచినట్లు తెలిపారు. జహింగీర్ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజు, డిఐ సర్దార్ నాయక్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

## భోజగుట్టలో కూల్చివేతలు.. కొద్దిసేపు ఉద్రిక్తత



భోజగుంటలో రోడ్డుకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ అధికారులు.

**మెహదీపట్నం, జూన్ 17, ప్రభాతవార్త :** భోజగుట్టలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పెద్ద ఎత్తున పోలీసు బలగాలు భోజగోట్టను చుట్టుముట్టడంతో అక్కడ ఏం జరుగుతుందోనని స్థానికుల్లో ఆందోళన నెలకొంది. భోజగుట్టలో కూల్చివేతలు జరుగుతున్నాయని తెలుసుకున్న కొందరు స్థానికులు పోలీసులను అడ్డుకోవడంతో వారిని అదుపులోకి తీసుకొని కూల్చివేతలు ముగిసిన అనంతరం పోలీసులు వదిలేశారు. ఆసిఫ్ నగర్ మండల పరిధిలోని భోజగుట్టలో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు కట్టించేందుకు ముందుకు వచ్చి ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి కొన్ని ఇండ్లను అసంపూర్తిగానే నిర్మించింది. డబల్ బెడ్ రూమ్ లో విషయంలో శ్రీరామ్ నగర్, శివాజీ నగర్, వివేకానంద నగర్ వాసుల్లో భిన్నాభిప్రాయాలు ఉండడంతో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం మధ్యలోనే వదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ల విషయం మళ్లీ తెర మీదికి రావడంతో అధికారులు బొజగుట్టలో డబల్ బెడ్ రూములను నిర్మించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా భోజగుట్ట వాసులతో జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్న వారికి ఆసిఫ్ నగర్ మండల రెవెన్యూ అధికారులు పట్టాలను కూడా అందజేసి నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి సిద్ధపడుతున్నారు. దీంతో భోజగుట్టలో రవాణా వ్యవస్థకు అడ్డుగా ఉన్న కొన్ని ఇండ్లను మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ నగర్ మండల తహసిల్దార్ జ్యోతి మాట్లాడుతూ...భోజగుట్టలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. దారికి అడ్డంగా ఉన్న, రోడ్డును ఆక్రమించి వేసిన దుకాణాలు గుడిసెలను మాత్రం తొలగించడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై ముందస్తుగానే సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. కూల్సుంపుర, ఆసిఫ్ నగర్ ఏసీపీల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి

### -దోమల నివారణకు కాలనీలు, పార్కులు, చెరువుల్లో ఫాగింగ్ చేపట్టాలి
### -అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి కర్ణన్, అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ తదితరులు

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఅండ్‌హెచ్‌ఓలు, ఎంటమాలజీ అధికారులతో శానిటేషన్, దోమల నివారణ, ఆస్తిపన్ను వసూళ్ల పై కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దోమల నివారణకు చేస్తున్న ఫాగింగ్ పై అసిస్టెంట్ మెడికల్ అధికారి పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. ఫాగింగ్ సాయంత్రం 4 గంటల నుండి 10 గంటల వరకు తప్పని సరిగా చేయాలని, ఏఎల్ఓ లు క్షేత్ర స్థాయిలో యాంటీ లార్వా కార్యక్రమం, ఉదయం, సాయంత్రం ఫాగింగ్ పనులు చేపట్టాలన్నారు. ఫాగింగ్ సర్కిల్ వారీగా అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్, జోనల్ స్థాయిలో ఎస్ ఈ లు బాధ్యత తీసుకోవాలన్నారు.. డెంగ్యూ వ్యాధి ప్రబలిన జాబితా బస్తీ దవాఖానా, పి హెచ్ సి నుండి సేకరించిన వ్యక్తుల ఇంటి నుండి ఎస్ ఓపి కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.

**లక్ష్యం మేరకు ఆస్తిపన్ను వసూలు చేయాలి..**

అలాగే నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూలు చేయాలని బిల్లు కలెక్టర్ కు ఇచ్చిన టార్గెట్ మేరకు వసూలు చేయాల్సిందేనన్నారు. రెసిడెంట్ భవనంలో కమర్షియల్స్ చేస్తున్న ఇళ్లను గుర్తించి టాక్స్‌వసులు చేయాలన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ లేని పక్షంలో టాక్స్ వసూలు చేయాలన్నారు. ప్రతి నెల టాక్స్ పై సమీక్ష నిర్వహిస్తామన్నారు. బౌన్స్ చెక్కులు బేగం పేట్, సరూర్ నగర్‌లో ఎక్కువ వచ్చినందున వాటిని వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత డీ.సి లను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, పంకజ, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవ్ రావు, రవి కిరణ్, వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ అధికారులు, ఎంటమాలజి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య భోజుడు గోన బుద్ధా రెడ్డి : సిరికొండ మధుసూదనాచారి



ప్రసంగిస్తున్న శాసన మండలి లో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, జూన్ 17 ప్రభాతవార్త:** తెలుగులో తొలి సారిగా వాల్మీకి సంస్కృత రామాయణాన్ని రంగనాథ రామాయణం పేరిట అనువదించిన వారు గోన బుద్ధారెడ్డి అని శాసన మండలి లో ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి అన్నారు. అయన సాహిత్య భోజుడు గా నాటి కాలం గుర్తింపు పొందారని చెప్పారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గానసభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా తెలుగు కవి గోన బుద్ధారెడ్డి యాది లో పేరిట సంస్మరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మధు సూదనాచారి మాటాడుతూ బుద్ధా రెడ్డి పదమూడవ శతాబ్దికి చెందినవారని, కాకతీయ ప్రభువులకు సామంత రాజు రాయచూర్ పరిగణ ను పాలించారని వివరించారు. తెలుగు సాహిత్యం విశిష్ట పెంచిన ఇట్టి వారి గురించి నేటి తరాలు తెలియజేసేందుకు గానసభ చేస్తున్న సేవ మీడియా సహసకారం అభినంద నీయం అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జయరాములు మాట్లాడుతూ ఆంధ్ర మహా భారత రచన చేసిన తిక్కన సమకాలీకుడు బుద్ధ రెడ్డి అని రాణి రుద్రమ దేవి సమకాలికుడు ఐన గోన గన్నారెడ్డి కుమారుడు అని తెలిపారు సరళమైన తెలుగు లో బుద్ధ రెడ్డి రాసిన ఉడత సాయం సీతానేషణం వొక నాడు పాఠాలు గా ఉండేవి అని గుర్తు చేశారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై గాయని లక్ష్మీ శాంతి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు



హైదర్షాకోట్ శాంతినగర్‌కాలనీలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దేవలయ 16.వ, వార్షికోత్సవంలో పాల్గొన్న నాయకుల దృశ్యం

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ హైదర్షాకోట్ గ్రామం శాంతినగర్‌లో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ 16.వ, వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయ జయ ధ్వనుల మధ్య కన్నుల పండువగా సాగాయి. మంగళవారం తెల్లవారు ఝామున నుంచే భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక "హనుమాన్ చాలీస పారాయణం" చేశారు. భక్తుల హనుమాన్ చాలిసా పారాయణంతో ఆలయమంతా మారుమ్రోగిపోయింది. ఈ వార్షికోత్సవ వేడుకల్లో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సంతోషి రాజిరెడ్డి, పుర ప్రముఖులు టింకూరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులంతా దేవాలయ దర్శనం, భగవద్గీతా, హనుమాన్ చాలీసా పారాయణాలను దినచర్యలో భాగం చేసుకోవాలన్నారు. మన ధర్మంను మనం భక్తి, శ్రద్దలతో ఆచరిస్తూ ఇతర ధర్మాలను గౌరవించాలన్నారు. పెద్దలు దేవాలయాలకు వెళుతూ తమ బిడ్డలను వెంట తీసుకెళ్లాలని, మన సనాతన ధర్మం గొప్పతనంను తెలియచేస్తుండాలన్నారు. భారతదేశంలో హనుమాన్ ఆలయం లేని గ్రామం లేదని, ప్రతీ గ్రామంలో హనుమాన్ ఆలయం తప్పకుండా ఉంటుందన్నారు. ఈ ఆలయం ఉండడం వల్లనే ఆ గ్రామాల ప్రజలు దుష్ట శక్తుల, పీడల నుంచి సంరక్షింపబడుతున్నారన్నారు. బలానికి, బంటుకి హనుమాన్ మారుపేరని తెలిపారు. మన జీవితంలో ఎన్ని సంకటాలు వచ్చినా జైహనుమాన్ అని తలిస్తే అన్నీ పటాపంచలవుతాయని రాజేందర్‌రెడ్డి వివరించారు.

### అభివృద్ధి పనులపై కమిషనర్ శరత్‌చంద్ర సమీక్ష




బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ అభివృద్ధిపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :**

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, 100.రోజుల కార్యాచరణ ప్రణాళికలపై కమీషనర్ శరత్‌చంద్ర మంగళవారం అన్ని శాఖల అధికారుల, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై వేగంగా స్పందించాలని, జవాబుదారి తనంగా పని చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలం కావడం వలన పారిశుద్య సిబ్బంది, కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలాలు, మ్యాన్ హోల్ల వలన వరద వచ్చే సమయంలో ప్రాణనష్టం జరుగకుండా చూడాలన్నారు. చెత్త, మురుగు నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల విచారణ, రాజీవ్ వికాసం దరఖాస్తుల స్వీకరణ, నూతన రేషన్ కార్డుల విచారణ, ట్రేడ్ లైసెన్స్, జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ, ఎల్ఆర్ఎస్ సర్వే, అడ్వర్‌టైజ్‌మెంట్ పన్నుల వసూళ్ళ, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, కోర్టు కేసులు, మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫాంస్ తయారీ, నూతన సంఘాల ఏర్పాటు, వివిధ లక్ష్యాల సాధన, ఆస్థి పన్ను వసూళ్ళ, వీధి దీపాల నిర్వాహణ, వన మహోత్సవం, నర్సరీల నిర్వాహణ వంటి అంశాలపై అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మేనేజర్ మంజులత, డిఇఇ యాదయ్య, ఆర్‌ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ముష్కిన్ చెరువులోకి మురుగు నీరు రాకుండా చూడాలి

**- మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ**



మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కిన్ చెరువును సందర్శించిన బిఆర్ఎస్ నాయకుల బృందం

**నార్సింగి, జూన్ 17 ప్రభాతవార్త :** ముష్కిన్ చెరువులోకి మురుగునీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. మంగళవారం పుప్పాలగూడలోని ముష్కిన్ చెరువును బిఆర్ఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ 52.ఎకరాలున్న ముష్కిన్ చెరువును పట్టించుకునే వారు లేక ఇప్పుడు కేవలం 12.ఎకరాలకే పరిమితం అయ్యిందని పేర్కొన్నారు. మిగిలిన ఈ చెరువు స్థలం ఇక నుంచి కబ్జా కాకుండా ఉండేందుకు హైడ్రా, హెచ్ఎండిఏ అధికారులను కోరామని తెలిపారు. చెరువు చుట్టూ కట్ట నిర్మించి, పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని డిమాండ్ చేశారు. చెరువులోకి వర్షపు నీటిని తీసుకు వచ్చే వరద కాలువలను కాపాడాలని, డ్రైనేజి నీరు కలువకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ఈ చెరువు వద్ద అహ్లాదకరమైన వాతావరణంను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నరేందర్, అందె లక్ష్మణ్‌రావ్, విఠల్, సంగం శ్రీకాంత్, శ్రీధర్, ఆరిఫ్, కిరణ్, రామ్, సుమ నళిని, బాబురావ్, ప్రవీన్, బాలాజీ, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### చెరువులను, కుంటలను పరిరక్షించండి: జగదీశ్వర్‌గౌడ్

**శేరిలింగంపల్లి, జూన్17 ప్రభాతవార్త :** చెరువులను, కుంటలను పరిరక్షించటంలో అధికారులు చొరవచూపాలని గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు పరిసర ప్రాంతాలను జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, డిప్యూటి కమిషనర్ మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. ఈర్ల చెరువులో మురికినీరు రాకుండా చేపట్టాల్సిన అభివృద్ది పనులను తక్షణమే చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఎస్‌సీ శంకర్‌నాయక్, డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాలి



రైల్వే డిజిఎం ఉదయ్‌నాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి, బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 17 ప్రభాతవార్త :** శివరాంపల్లి రైల్వే గేట్ రహదారి వద్ద మూసివేసి గోడ నిర్మించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని వెంటనే గోడను తొలగించాలని కోరుతూ మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో డిజిఎం ఉదయ్‌నాధ్‌ను కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు కలిసి ఈ విషయమై చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వెంటనే ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందించి తన కార్యాయం నుంచి ఇచ్చిన వినతి ప్రతి బాధిక సంబంధించిన వినతి పత్రాన్ని రైల్వే డిజిఎం ఉయద్ నాథ్‌కు అందజేయటంతో పాటు సమస్యను పరిష్కరించాలని తోకల శ్రీనివాస్ రెడ్డి కోరారు. శివరాం పల్లి గేటు వద్ద రోడ్డుకు అడ్డంగా నిర్మించిన గోడను తొలగించాని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు గోదా పాండు యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు సంతు గౌడ్, మధుసూధన్ రెడ్డి, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

### వాల్ పోస్టర్ విడుదల చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి

**చార్మినార్, జూన్ 17 ప్రభాతవార్త :**

కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం షియా ముస్లింకు సంబంధించిన ఈద్-ఇ-ఘదీర్ పండుగ వాల్ పోస్టర్‌ను మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ జి.మనోహర్‌రెడ్డి, శ్రీనివాస్ నేతాతో పాటు పలువురు పాల్గొన్నారు.

### హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని గ్రేటర్ కమిషనర్‌తో కలిసి సందర్శించిన జగదీశ్వర్‌గౌడ్



**శేరిలింగంపల్లి, జూన్17 ప్రభాతవార్త**

హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నందు నూతనంగా చేట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అధికారులను కోరారు. హఫీజ్‌పేట్ డివిజన్‌పరిధిలోని హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నందు నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ది పనులను జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, డీసీ మోహన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఎస్‌సీ శంకర్‌నాయక్‌లతో కలిసి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ. హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నందు ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ శ్రీదేవి, ఏఈ ప్రతాప్, అధికారులతో కలిసి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైద్య సహాయం కోసం తెల్ల రేషన్ కార్డు అందించిన కార్పొరేటర్



**మల్కాజిగిరి జూన్ 17,ప్రభాతవార్త :** బి జె ఆర్ నగర్ బస్తీకి చెందిన నరసింహ గత కొద్ది కాలంగా అనారోగ్యంతో డయాలసిస్ చేయించుకుంటున్నారు వివిధ వైద్య సదుపాయాల కోసం తెల్ల రేషన్ కార్డ్ లేనందువల్ల చాలా ఇబ్బంది పడుతున్నారు, ఈ విషయాన్ని బిజేఆర్ నగర్ చెందిన సీనియర్ నాయకుడు బాబన్న కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చి వెంటనే వారికి తెల్ల రేషన్ కార్డు కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ తిళీవీతో మాట్లాడి వారి సమస్య ను తెలుపడం జరిగింది అప్రోల్ చేయడం జరిగింది కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ రేషన్ కార్డు ఆన్లైన్ పేపర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు , నరసింహ మరియు వారి కుటుంబ సభ్యులు సమయానికి ఆదుకున్నందుకు కార్పొరేటర్కి ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి సీనియర్ నాయకులు బాబు సత్యనారాయణ బ్రహ్మయ్య రాము రామకృష్ణ కిషోర్ పాల్గొన్నారు

## కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ జక్కా వెంకటరెడ్డి ,మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తదితరులు

**మేడిపల్లి , జూన్ 17 ప్రభాతవార్త ;** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా షామీర్ పేట్ లోని ధనలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ నందు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ , మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి , మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లం వెంకటేష్ గౌడ్, నాగిరెడ్డి, సాయి, లోకేష్, బిక్కు మాత్రే తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి

### -ఇంచార్జ్ చిలుకా నరసింహారెడ్డి



ఇంచార్జ్ ఎస్జిఎస్ చిలుక నరసింహారెడ్డిని సన్మానిస్తున్న వ్యాపారస్తులు అశోక్ తదితరులు

**మలక్ పేట, జూన్ 17, ప్రభాతవార్త:** రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలుక నరసింహారెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ ఫుల్ ఫుల్ అడిషనల్ ఛార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టిన చిలుక నరసింహారెడ్డిని వ్యాపారస్తులు బి. అశోక్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా చిలుకా నరసింహారెడ్డి మాట్లాడుతూ తాము పండించిన సరుకును మార్కెట్ కు తీసుకువచ్చే రైతులకు మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్నింటిని అభివృద్ధి చేసి ఆధునికరించనున్నట్లు వివరించారు. వ్యాపారస్తుల సమస్యలు తెలుసుకుని వారి అభ్యున్నతికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్ డివిజన్ బిజెపి నూతన కమిటీ నియామకం

**మన్సూరాబాద్ జూన్ 18, ప్రభాతవార్త:** మన్సూరాబాద్ డివిజన్ లో భారతీయ జనతా పార్టీ నూతన డివిజన్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులుగా మునగాల హరీష్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు గా ఎంజాలా జగన్, ఏ. ప్రమోద్ రెడ్డి, పి. సంపత్ గౌడ్, డి. శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శులు గా టి. శ్యాంసుందర్ రెడ్డి, ఎం. నవీన్ రావు,కార్యదర్శులు గా కే. మోహన్ రెడ్డి, బి.సి. నరసింహుడు, జి. గోవింద్ రెడ్డి, విజయ లక్ష్మీ , కోశాధికారి గా కే. దామోదర్ గౌడ్ ఆఫీస్ ఇన్చార్జిగా : ఎల్లారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా మల్లు మంగారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు గా ప్రవీణ్ కుమార్ గౌడ్,ఎస్సీ మోర్చా అధ్యక్షులు గా మెరిగ మల్ల విజయకుమార్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## పుణ్యక్షేత్రాలకు విహారయాత్రలకు బస్సు సౌకర్యం

### న-దిల్షుక్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత

**మలక్ పేట ,జూన్ 17, ప్రభాతవార్త:**

పుణ్యక్షేత్రాలకు, విహారయాత్రలకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సమత పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ సిటీ ఆర్టీసీ డిపో నుండి ఈ నెల 27వ తేదీ శుక్రవారం రోజు ఉదయం 5:00 గంటలకు కు బయలుదేరి రాత్రి 7:00 గంటల వరకు ఒక రోజులో భూకైలాస్ దేవాలయం, కోటపల్లి ప్రాజెక్ట్ , బుగ్గ రామేశ్వరం దేవాలయం మరియు అనంతగిరి లోని అనంత పద్మ నాభ స్వామి దేవాలయం దర్శనంతో సహా పచ్చని గుట్టల ప్రాంతంలో విహరించుటకు 40 మంది కెపాసిటీ గల మెట్రో డీలక్స్ బస్సు ను ఏర్పాటు చేయడం జరిగిందని దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమతి సమత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యముగా ఒకసారి 30 మంది ప్రయాణికులు ఉన్నచో వారు చెప్పిన ప్రదేశము నుండి కూడా బస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశమును భక్తులు,కాలనీ వాసులు,స్కూల్ విద్యార్థులు మరియు కాలేజీ విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు దిల్ షుక్ నగర్ సిటీ డిపో యొక్క ఫోన్ నెంబర్లను 7989928321,9063102132, 8247381525, 9959226137 సంప్రదించాలని పేర్కొన్నారు. టికెట్ ఛార్జి రూపాయలు పెద్దలకు 600 పిల్లలకు 300 మాత్రమేనని తెలిపారు.

# ట్రీగార్డ్స్, చెట్ల తొలగింపుతో ఆందోళన

-సీఎం ఆఫీసు,అధికారులు నుంచి ఆదేశాలు

-ఒక్క ఫిర్యాదుతో ట్రీ గార్డుల తొలగింపు

-అధికారుల అత్యుత్సాహం

-కార్పొరేటర్, స్థానిక ప్రజలు ఆగ్రహం

-సామాన్యులకు ఓ న్యాయం..బడా బాబులకు ఓ న్యాయం



తొలగించిన ట్రీగాడ్స్ ను పరిశీలిస్తున్న ప్రేమ్మహేశ్వర్రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** సామాన్యులు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు బడా బాబులు ఫిర్యాదు చేస్తే వెనక ముందు ఆలోచించకుండా వెంటనే చర్యలు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని గడ్డిఅన్నారని డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్మహేశ్వర్రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని ప్రేమించే వారిపై ప్రభుత్వం దాడి చేయడం బాధాకరమని అసహనం వ్యక్తం చేశారు. గడ్డిఅన్నారం డివిజన్ కమలా నగర్కాలనీ లాంగ్ డ్రైవ్కార్స్ కార్యాలయం సమీపంలోని నివాసాల ముందు ఉన్న ట్రీ గార్డులను చెట్లను టౌన్ప్లానింగ్ అధికారులు పోలీసు బందొబస్తుతో వచ్చి మంగళవారం తొలగించారు. సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని చెట్లను ట్రీగార్డులను తొలగించడం పట్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా, ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా, పూలమొక్కలు, ట్రీగార్డులను బుల్డోజర్తో ధ్వంసం చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. వాటిని తొలగిస్తున్న అధికారుల తీరును ప్రశ్నించిన సీనియర్ సిటిజన్లకు ఏ సమాధానం చెప్పకుండా మాకు జిహెచ్ఎంసి ఉన్నతాధికారుల నుంచి, సీఎం ఆఫీసు నుంచి ఆదేశాలు వచ్చాయంటూ పోలీసులతో కలిసి వచ్చిన టౌన్ప్లానింగ్ అధికారులు, సిబ్బంది బందొబస్తుతో వచ్చి బుల్డోజర్తో విచక్షణ రైతంగా మొక్కలను తొలగించి వెళ్లిపోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సామాన్య ప్రజలకు ఒక న్యాయం, బడా బాబులకు ఇంకొక న్యాయమా అని అధికారులను నిలదీశారు. డివిజన్లో అనేక అక్రమ నిర్మాణాలు ఉన్నాయని టౌన్ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోని అధికారులు పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన చిన్న ట్రీగార్డులే ఆక్రమణగా ఎలా కనిపించాయో వారు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధిని పక్కన పెట్టి, ప్రజలతో చర్చించకుండా పోలీసులను అడ్డుపెట్టుకొని ఇలాంటి దౌర్జన్య నిర్ణయాలు తీసుకోవడం అప్రజాస్మికమన్నారు. చెరువులు, నాళాలలు, పార్కు స్థలాలు కబ్జాలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించి అనేకమంది వేలాది ఫిర్యాదులు చేసిన పట్టించుకోని అధికారులు ఇంత దౌర్జన్యంగా కూల్చివేయడం సమంజసం కాదన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారి పరపతి ఉపయోగించి ఒక్క ఫిర్యాదుతో ఎవరికి ఇబ్బంది లేని ట్రీగాడ్స్ చెట్లను తొలగిం చారని, ప్రశ్నించిన సీనియర్ సిటిజెన్ లను బెదిరించారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని వదిలే ప్రసక్తి లేదని ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రజా సమస్యలపై సిపిఐ నిబద్ధతతో పోరడుతోంది : ఎమ్మెల్సీ సత్యం

**హయత్ నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని... ఆ మార్గంలో సీపీఐ నిబద్ధతో పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ హయత్ నగర్ మండల కమిటీ 10వ మహాసభను మంగళవారం హయత్ నగర్ లోని పద్మావతి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి భారీర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఎగురవేసారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.... భూ పోరాటాల్లో భాగంగా వేలాది మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అంధుచడంతో పాటు భూములపై హక్కులు కల్పించిన ఘనత సీపీఐకి దక్కుతుందన్నారు. వందేళ్ల చరిత్ర గల కమ్యూనిస్టు పార్టీ దేశ స్వాతంత్ర ఉద్యమంతో మొదలుకుని తెలంగాణ సాయుధ పోరాటం వరకు కీలకపాత్ర పోషించిందన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వాడవాడలా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వంశీవర్ధన్ రెడ్డి, మ్రి శోభన్, శేషరాజుపల్లి శ్రీదేవి, బొంగు అరుణ్ కుమార్ గౌడ్, రమావత్ సక్రు నాయక్, పోలోజు లక్ష్మణ్ పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సత్యం, నాయకులు.

## సింగరేణి కాలనీలోని మా స్థలాన్ని మాకు ఇప్పించండి

### ..హైడ్రా కమిషనర్కు ఇండస్ట్రీస్ సొసైటీ సభ్యుల వినతి

**సైదాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలో తమ హౌజింగ్ సొసైటీకి చెందిన స్థలాన్ని తమకు ఇప్పించాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్కు ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ ఎంప్లాయిస్ హౌజ్ బిల్డింగ్ కోఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే తాము ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి సొమ్ము చెల్లించి కొనుగోలు చేసిన స్థలాన్ని ఇప్పటి వరకు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 1976లో ఏర్పడిన తమ సొసైటీ 1981లో సైదాబాద్ మండల పరిధిలోని సర్వే నెం.65 నుంచి 77, 133(పార్ట్), 125(పార్ట్)లోని 25 ఎకరాల భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రకాల చెల్లింపులు చేసి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. సొసైటీలోని 294 సభ్యుల కోసం స్థలాన్ని 314 ప్లాట్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. సభ్యుల్లో 54 మంది అక్కడే ఇండ్లు నిర్మించుకుని ఉంటున్నారని, అయితే మిగిలిన స్థలంలో స్థానిక నాయకుల ప్రోద్భలంతో కొందరు గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. 42 సంవత్సరాల క్రితం భూమిని కొనుగోలు చేసిన తమ సంస్థలోని సభ్యుల్లో కొందరు ఇప్పటికే మరణించారని, మిగిలిన వారు సైతం వయో వృద్ధులుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా తమకు తమ స్థలాన్ని అప్పగించాలని వారు కోరారు. హైడ్రా కమిషనర్ను కలిసిన వారిలో సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్రెడ్డి, కన్వీనర్ ఉదయ్ చంద్, సభ్యులు వీరారెడ్డి, సత్యవతి, అనిల్ తదితరులు ఉన్నారు.



హైడ్రా కమీషనర్కు వినతిపత్రం అందజేస్తున్న ఇండస్ట్రీస్ సొసైటీ సభ్యులు

## మీర్పేట్ పెద్ద చెరువు సుందరీకరణ పనులపై సబితా ఇంద్రారెడ్డి సమీక్ష

### -ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశనం చేసిన మాజీ మంత్రి

**సరూర్నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీర్పేట్ ప్రధాన పెద్ద చెరువు సుందరీకరణ పనులను మంగళవారం మాజీ మంత్రి, స్థానిక శాసన సభ్యురాలు పి.సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. కార్పొరేషన్ కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డిఇఇ వెంకన్నలతో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఆమె పాదయాత్రలు చేస్తూ పర్యటించి పనులను సమీక్షించారు. ఇందులో భాగంగా బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్, చెరువు చుట్టూ ఫెన్సింగ్, వీధి దీపాలు, చెరువు బ్యూటీఫికేషన్ కోసం చేపట్టే పనులతో పాటు క్రికెట్ గ్రౌండ్, వాలీబాల్ కోర్టు పనులపై అధికారులతో చర్చించారు. అనంతరం చెరువు ఆనుకొని పక్కనే ఇరువైపులా ఉన్న మీర్పేట్, లెనిన్నగర్ వైకుంఠ ధామాలను కూడా సబితారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆమె ఆయా అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, పార్టీ అధ్యక్షుడు అర్కల భూపాల్రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్గౌడ్, మహిళాధ్యక్షురాలు జమాల్పూర్ సునీత బాలరాజ్, పార్టీ నాయకులు దీప్లాల్ చౌహాన్, దోమలపల్లి రాజ్కుమార్, సిద్దాల అంజయ్య, మాదరి రమేష్, పోరెడ్డి ప్రభాకర్రెడ్డి, సీనియర్ నాయకురాలు పాలపర్తి విజయలక్ష్మి, తుమ్మల నిర్మలారెడ్డి, కార్పొరేషన్ మీడియా సెల్ కన్వీనర్ వీర రాఘవరెడ్డితో పాటు బడంగ్పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, నాయకుడు బోయపల్లి శేఖర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మీర్పేట్ పెద్ద చెరువు వద్ద సుందరీకరణ పనులను సమీక్షిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

## విస్తృతంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలు

**సరూర్నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ కార్పొరేషన్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సిడిఎంఎ ఉత్తర్వుల మేరకు కార్పొరేషన్లోని డివిజన్లలో ముమ్మరంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు ప్రారంభమైన రోజు నుండి కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకొని యాక్షన్ ప్లాన్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. స్వయంగా దగ్గరుండి మరీ డ్రైనేజీల్లో పూడికలు, ఓపెన్ వరద కాలువల నుండి చెత్తా చెదారాన్ని పారిశుధ్య సిబ్బందితో తొలగింపజేస్తూ కాలనీలు, వీకర్ సెక్షన్లు, పాత గ్రామాల్లో ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త రిక్షాలకు ఇవ్వడంపై అవగాహన కల్పిస్తున్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం బాలాపూర్ అర్బన్ పిహెచ్సి వారిచే ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం కార్పొరేషన్లోని 22వ డివిజన్ విజయ హోమ్స్లో భూగర్భ డ్రైనేజీల నుండి సిల్ట్ బకెట్ మిషన్ ద్వారా పూడిక తీయించారు. 1, 18 డివిజన్లలో గార్బేజ్ వర్నరేబల్ పాయింట్ వద్ద చెత్త వేయకుండా కాలనీవాసులకు అవగాహన కల్పించి బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ టి.రమేష్, జూనియర్ అసిస్టెంట్ ఎం.నర్సింహ, పర్యావరణ ఇంజనీర్ రాము, వార్డు ఆఫీసర్లు, పారిశుధ్య జవాన్లు దాసరి రంజిత్, దాసరి జీవన్, సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సిల్ట్ బకెట్ సిస్టం ద్వారా డ్రైనేజీల్లో పూడిక తీయిస్తున్న మీర్పేట్ కమీషనర్ జ్ఞానేశ్వర్

## బోనాల పండుగకు నిధులు మంజూరు చేయాలి : కార్పొరేటర్ అరుణ రవీందర్రెడ్డి



జడ్సికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్రెడ్డి

**సైదాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** రాబోయే బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని సైదాబాద్ డివిజన్లో అమ్మవారి దేవాలయాల వద్ద తగిన అభివృద్ధి పనుల కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతూ జోనల్ కమీషనర్ వెంకన్నకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్రెడ్డి వినతిపత్రంనఅందజేశారు. అదేవిధంగా కరణ్బాగ్లో ఓపెన్ జిమ్, భూలక్ష్మినగర్, హరిజనబస్తీలలో మోడల్ జిమ్లు ఏర్పాటు చేయాలని జడ్సిని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ కోరారు.

## కర్మన్ఘాట్ జడ్పిహెచ్ఎస్లో పోలీసుల అవగాహన సదస్సు

**సైదాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** రాచకొండ ఏ.హెచ్.టి.యు ఆధ్వర్యంలో కర్మన్ఘాట్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఏ.హెచ్.టి.యు ఎస్ఐ జి.వెంకట శ్రీను, కె.రాములు నాయక్, ఏఎస్ఐ జి.వెంకట్స్వామి, ఏఎస్ఐ అనురాధల ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.రాములు నాయక్ మాట్లాడుతూ బాల కార్మికులు, నిర్బంధ కార్మికులు, బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, ర్యాగింగ్, సైబర్ క్రైమ్స్, టి సేఫ్ అప్లికేషన్, రోడ్డు భద్రత, ఈవ్ టీజింగ్, కొత్త చట్టాలు బిఎన్ఎస్, బిఎన్ఎస్ఎస్, బిఎస్ఏల గురించి అవగాహన కల్పించారు. మహిళలు ప్రయాణ సమయంలో తాము ప్రమాదంలో ఉన్నామనిపిస్తే వెంటనే 100కు కాల్ చేయాలని సూచించారు. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.పద్మ, పిడి రఘువీరారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి అమ్మవారికి 108 రోజులు కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన కార్యక్రమాన్ని మహిళలు నిర్వహిస్తున్నారు. కొత్తపేట మారుతినగర్లోని శ్రీప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండవ తేదీ విజయదశమి వరకు 18 రోజులపాటు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి నిత్య కుంకుమార్చన కార్యక్రమం మంగళవారం ప్రారంభమయ్యింది. దేవాలయం ప్రధాన అర్చకుడు గుండెపూడి సుధీర్శర్మ పౌరోహిత్యంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ప్రతినిధులు లింగాల నాగేశ్వరరావు, రాయుడు, మురళీధర్రావు, కామేశ్వరరావు, మల్లేశం, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ల వినతి



జోనల్ కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న రాధాధీరజ్రెడ్డి, పవన్కుమార్

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** తమ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆర్కే పురం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్లు రాధాధీరజ్రెడ్డి, నాయకోటి పవన్కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్కేశవ్పాటిల్కు వినతి పత్రాన్ని వారు అందజేశారు. అల్కాపురి జంక్షన్ వరకు వేస్తున్నటువంటి స్ట్రామ్ వాటర్ పైప్లైన్లను నాగోల్ మూసిలోకి వెళ్లే విధంగా పనులు పూర్తి చేయాలని కోరారు. రూ.25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. గాయత్రి పురం నుంచి శ్రీరామలింగేశ్వరకాలనీ వరకు స్ట్రాంవాటర్ బాక్స్ డ్రైనేజ్ కొరకు రూ.6కోట్లు మంజూరు చేసి టెండర్ వేయించారన్నారు. న్యూమారుతినగర్, ఓల్డ్ మారుతినగర్, కొత్తపేట విలేజ్, బృందావన్కాలనీలో నూతన సీసీ రోడ్లు, 23 ఐమాక్స్లైట్లు మంజూరు చేయాలని కోరారు.

## 20వ తేదీన ఎల్బీ స్టేడియంలో యోగా

**ఎల్.బి.నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** ఈనెల 20వ తేదీన లాల్ బహుదూర్ స్టేడియంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలకు పెద్దఎత్తున తరలిరావాలని యోగా గురువు ఇస్మాయిల్ గురూజీ కోరారు. కొత్తపేట హుడాకాంప్లెక్స్ లోటస్ల్యాప్ పబ్లిక్ స్కూల్ దగ్గర నుంచి 20వ తేదీన బస్సు బయలుదేరుతుందని, ఉదయం 5 గంటలకు యోగా సెంటర్ వద్దకు అందరూ రావాలని కోరారు. యోగ చేయండి అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండండి అన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

### నీట్ ఫలితాలలో అపోలో మెడికల్ అకాడమీ హవా

**ఎల్.బి.నగర్ జూన్ 17 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలలో దిల్ సుఖ్ నగర్ అపోలో మెడికల్ అకాడమీ ప్రభంజనం సృష్టించి అత్యుత్తమ ర్యాంకులు సాధించామని అపోలో మెడికల్ అకాడమీ చైర్మన్ పోసిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను అకాడమీలో ఘనంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ అకాడమీ నుండి 600 మంది విద్యార్థులు నీట్ రాయగ 412 విద్యార్థులు మెడికల్ సీట్లతో పాటు, 720 మార్కుల గాను 658 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యా విధానంలో మార్పులకు అనుగుణంగా అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో బోధించడం వల్లనే అత్యుత్తమ ఫలితాలు రాబట్టగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అల్వాల మధుసూదన్, అధ్యాపకులు శ్రీధర్, గోవర్ధన్ రెడ్డి, కెవిఆర్, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే బోనాల లోపు రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు పూర్తి చేయిస్తా : రాఘవేందర్రెడ్డి



పెంచాల్సిన రోడ్డు వెడల్పును కొలిపిస్తున్న బోయపల్లి రాఘవేందర్రెడ్డి

**సరూర్నగర్, జూన్ 17 ప్రభాతవార్త:** త్వరలో జరిగే అల్మాస్గూడ బోనాల పండగ లోపు స్థానిక బిఆర్ఆర్ ఎన్క్లేవ్ నుండి ఆయా మాత దేవాలయం వరకు గల ప్రధాన రహదారి నిర్మాణపు పనులు, మరమ్మతు పనులు, ప్యాచ్ వర్కులు పూర్తి చేయించడానికి కృషి చేస్తామని స్థానిక ఆంజనేయ స్వామి దేవస్థానం ఛైర్మన్ బోయపల్లి రాఘవేందర్రెడ్డి తెలిపారు. గ్రామ కూడలిలో దేవాలయం ముందు నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిసి రోడ్డుకు ఇరువైపులా రెండు మీటర్ల వరకు పెంచి రోడ్డు నిర్మాణం జరపాలని ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఈ రెండు వినతులకు అధికారులు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారని రాఘవేందర్రెడ్డి తెలిపారు.

## నేడు డయల్ యువర్ డిఎం కార్యక్రమం: డిపో మేనేజర్ సమత

**మలక్ పేట, జూన్ 17, ప్రభాతవార్త:** దిల్ షుక్ నగర్ ఆర్టీసీ డిపో లో ఈ నెల 18వ తేదీ బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సమత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులను డిపో మేనేజర్ దృష్టికి తీసుకురావాలని డిపో మేనేజర్ సమత పర్కొన్నారు. సెల్ నం.9959226137 లో సాయంత్రం నాలుగు గంటల నుండి 5 గంటల వరకు సంప్రదించాలని ఆమె కోరారు.